# పాపం రామారావు

చిట్టకవి శ్రీనివాసాచార్య



**రామారావ్! హలో.. హలో ఎవరో పిలుస్తున్నారు. కానీ రామారావుకు ఆ పిలుపు వినిపించలేదు. హడావుడిగా వెళ్తున్నాడు.**

రామారావు తరచుగా ప్రయాణాలు చేస్తూ ఉంటాడు. అతని బిజినెస్ ఏంటో అర్థం కాదు. కానీ ఎప్పుడూ ప్రయాణాలు చేస్తూనే ఉంటాడు. అయితే ఇక్కడివి అక్కడికీ, అక్కడివి ఇక్కడికీ వస్తువులు, సరుకులు రవాణా చేస్తూ కనిపిస్తాడు ఎక్కువగా. అందుకే అతన్ని అందరూ రవాణా రామారావు అంటుంటారు.

ఇలా ప్రయాణాలు చేసే రామారావుకు ఒకసారి ఆర్టీసీవారి 'క్యాట్ కార్డు' ప్రకటన కనిపించింది. వెంటనే దాన్ని గూర్చిన వివరాలు తెలుసుకున్నాడు. అదేదో లాభదాయకంగా తోచిందతనికి. చార్జిలో పదిశాతం రాయితీ, ప్రమాదాలు సంభవిస్తే లక్షాయాభైవేల రూపాయల నష్టపరిహారం బాగా నచ్చింది. వెంటనే స్టాంపు సైజు ఫోటోలు రెండు

తీయించుకొని, ఆర్టీసీ ఆఫీసుకెళ్ళి ఇరవై రూపాయల రాయితీతో 180 రూ/- చెల్లించి, సాయంత్రం 4 గంటలకు క్యాట్‌కార్డు చేతి కందుకున్నాడు. కలర్ ఫోటో ఇచ్చాడేమో క్యాట్‌కార్డు చూడముచ్చటగా ఉంది. ఒకటికి రెండుసార్లు దాన్నే చూసుకుంటూ ముచ్చట పడుతూ జేబులో పెట్టుకున్నాడు. సాయంత్రం ఊరికి వెళ్ళడానికి తిరుగుముఖం పట్టాడు. ఇంతలో తన ఊరివాళ్ళే ఇద్దరు ముగ్గురు కనిపించారు బస్టాండులో.

"ఏం రామారావ్! ఊరికేనా?" ప్రశ్నించారు.

"ఆ ఊరికే. మీరూ వస్తున్నారా?"

"లేదు. మేమిప్పుడే వచ్చాం. రాత్రికి ఇక్కడే ఉండి రేపు వస్తాం. సరేకానీ నువ్వు ఇంతసేపు ఉన్నావేంటి?" తిరిగి ప్రశ్నించారు.

"క్యాట్‌కార్డుకు అప్లయ్ చేశాలే. ఇదిగో వచ్చింది కూడా" అంటూ జేబులో నుంచి తీసి వాళ్ళకు చూపించాడు కార్డును.

వాళ్ళు దాన్ని చేతికి తీసుకొని అటు ఇటు తిప్పి చూసి

"బాగుందోయ్ మేం కూడా తీసుకోవాలి ఎప్పుడో" అంటూ కార్డునే చూస్తూ రామారావు చేతికి ఇచ్చారు వాళ్ళు.

రామారావు మరికొన్ని క్షణాలు దాన్నే చూసి, లోలోపలే మురిసిపోతూ మళ్ళీ జేబులో పెట్టుకున్నాడు కార్డును.

ఇంతలో తను ఎక్కాల్సిన బస్సు రానే వచ్చింది. బస్సంతా ఖాళీగా ఉంది. బస్సు ఎక్కాల్సిన వాళ్ళు ఇరవైమంది కూడా లేరు. కొందరు కిటికీల్లోంచి కర్చీఫులు సీట్లలో వేయసాగారు. మరికొందరు జనాన్ని నెట్టేస్తూ లోపలికి వెళ్లసాగారు. స్త్రీలను, వృద్ధుల్ని పట్టించుకునే నాథుడు లేడు. రామారావు వాళ్ళను చూస్తూ నవ్వుకొంటూ, అందరూ ఎక్కిన తరువాత తీరిగ్గా తన సామానుతో బస్సెక్కి ఒక సీటులో కూర్చున్నాడు. సామాను భద్రంగా సర్దుకున్నాడు. క్యాట్ కార్డు వల్ల లాభం పొందే మొదటి అవకాశం వచ్చిందని సంతోషపడ్డాడు.

ఇంతలో కండక్టర్ రానే వచ్చాడు. అందరికీ టిక్కెట్లు ఇస్తూ రామారావు దగ్గరికి వచ్చాడు. రామారావు తన ఊరిపేరు చెప్పి క్యాట్‌కార్డు అన్నాడు. కండక్టర్ టిక్కెట్టు పంచి చేసి ఇచ్చాడు. టిక్కెట్టుతోపాటు కండక్టర్ తిరిగి ఇచ్చిన రూ. 6/- జేబులో పెట్టుకున్నాడు రామారావు.

ఇప్పుడు రామారావుకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే టౌన్ నుంచి వాళ్ళ ఊరికి మామూలుగా రూ.6/-. అయితే క్యాట్‌కార్డుకు రూ.4/-. కొద్ది దూరానికే రెండు రూపాయలు తగ్గడంతో రామారావు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తనకు పెద్ద నిధి దొరికి నంత సంబరమైంది. ఆ బస్సులోనే ఉన్న తన ఊరివాళ్ళతో క్యాట్‌కార్డు వల్ల లాభాల్ని గురించి సోదాహరణగా వివరించాడు.

ఇలా క్యాట్‌కార్డు వల్ల అనేక పర్యాయాలు లబ్ధి పొందిన రామారావు ఒకసారి దూర ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. బస్సెక్కి ఊరిపేరు చెప్పాడు కండక్టర్‌కి. కండక్టర్ టిక్కెట్టు కొట్టి ఇచ్చాడు. తరువాత కండక్టర్ రామారావు పక్క సీట్లో కూర్చున్న అతన్ని టిక్కెట్టు అడిగాడు. అతడు బారుగా తీసుకోకుండా మధ్యలో ఉన్న ఊరిపేరు చెప్పి క్యాట్ కార్డు అన్నాడు. కండక్టర్ టిక్కెట్టు కొట్టి ఇచ్చాడు. తరువాత రామారావు తన పక్కన ఉన్న అతనితో,

"ఏమండీ మీరెక్కడికి వెళ్లాలి?" అన్నాడు.

చెప్పాడు అతను.

"మరి మధ్యలో ఉన్న ఊరికి టిక్కెట్టు తీసుకున్నారేంటి?" మళ్ళీ ప్రశ్నించాడు రామారావు.


"మధ్యలో టిక్కెట్లు మార్చుకుంటే చార్జి బాగా తగ్గుతుందండీ" చెప్పాడతను. రామారావు ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో మధ్యలో ఊరు రానే వచ్చింది. క్యాట్ కార్డు ప్రయాణీకులంతా అక్కడ టిక్కెట్లు మార్చుకున్నారు. రామారావు తన పక్క అతని దగ్గరి రెండు టిక్కెట్లు తీసుకొని చూశాడు. తాను బారుగా తీసుకోవడంవల్ల నష్టపోయినట్లు అర్థం అయిందతనికి. ఇక అప్పటి నుంచి ఎప్పుడు ప్రయాణించినా మధ్యలో టిక్కెట్టు మార్చుకోవడం మొదలెట్టాడు.

అయితే టిక్కెట్లు మార్చుకోవడం మరీ అతి చేయడం మొదలెట్టాడు రామారావు. ఒకే ప్రయాణంలో మధ్యలో మూడుసార్లుదాకా టిక్కెట్లు మారుస్తూ వుండేవాడు. కొందరు కండక్టర్లు అతన్ని ఎగాదిగా చూస్తూ, ఏమీ అనలేక లోలోపలే తిట్టుకుంటూ టిక్కెట్లు ఇస్తూ ఉండేవాళ్ళు.

ఒకసారి రామారావు, ఉదయం 5 గంటలకే ఫస్టు బస్సుకు బయల్దేరాడు పట్నానికి. అలవాటు ప్రకారం మధ్య ఊరి వరకే టిక్కెట్టు తీసుకున్నాడు. బస్సు బయల్దేరింది. చల్లటి గాలికి హాయిగా నిద్ర పట్టింది రామారావుకు. నిద్రలోనే మధ్య ఊరు దాటింది. అక్కడే టిక్కెట్లు మార్చుకోవాల్సి ఉంది. కానీ గాఢ నిద్రలో ఉన్న రామారావుకు మెలకువ రాలేదు. కండక్టర్‌కు గుర్తు లేదు. ఆ తరువాత మరో స్టేజి వచ్చింది. అక్కడ చెకింగ్ అధికార్లు బస్సులోకి ప్రవేశించారు. అందరి టిక్కెట్లు చెక్ చేశారు. అందరివీ సరిగ్గా ఉన్నాయి. రామారావు దగ్గరికి వచ్చాడొక అధికారి. రామారావింకా నిద్రపోతూనే ఉన్నాడు. తట్టి లేపి టిక్కెట్టు అడిగాడు అధికారి. నిద్ర మత్తులో అది ఏ వూరో అర్థం కాని రామారావు, జేబులోంచి టిక్కెట్టు తీసి ఇచ్చాడు.

"ఇది వెనక ఊరి వరకే. ఇది కాదు" అన్నాడు అధికారి.



[illegible] దాటిపోయిందని అప్పుడర్థమైంది రామారావుకు.

"సార్ నేను నిద్రపోయాను సార్. టిక్కెట్టు మార్చుకోవడం కుదరలేదు సార్" యథార్థం చెప్పాడు రామారావు.

"లాభం లేదు. టిక్కెట్టు లేకుండా ప్రయాణించడం నేరం. 500 రూపాయలు జరిమానా కట్టండి" అన్నాడు అధికారి.

"సార్ సార్.. నేను కావాల్సి చెయ్యలేదు. నిజంగా నిద్రపట్టింది సార్. ఈసారికి వదిలేయండి సార్" ప్రాధేయపడ్డాడు రామారావు.

"నో.. అలా రూల్స్ ఒప్పుకోవు. 500 రూపాయలు జరిమానా కట్టాల్సిందే. లేదా జైలు శిక్ష అయినా అనుభవించండి" అన్నాడు అధికారి.

జైలుశిక్ష కన్నా జరిమానాయే మేలనుకొని, చేసేది లేక 500 రూ. జరిమానా చెల్లించాడు రామారావు.

ఆనాటి నుంచి బస్సులో నిద్రపోవడం మానుకున్నాడు. రామారావు తను క్యాట్‌కార్డు తీసుకొని ఇంచుమించు సంవత్సరం కావచ్చింది.

మళ్ళీ ఒకసారి మామూలుగా ఆర్టీసీకి ప్రయాణమయ్యాడు రామారావు. క్యాట్‌కార్డు ఉందో లేదో అని జేబు తడిమి చూసుకున్నాడు. భద్రంగా క్యాట్‌కార్డు చేతికి తగిలింది. బస్సెక్కి కూర్చున్నాడు. కండక్టర్ తన దగ్గరికి రాగానే క్యాట్‌కార్డు అని చెప్పి టిక్కెట్టు కొట్టించాడు. చల్లగాలికి నిద్ర రాబోయింది రామారావుకు. కానీ ఇంతకు ముందు తనకెదురైన చేదు సంఘటనను గుర్తుచేసుకొని బలవంతంగా నిద్రను ఆపుకున్నాడు రామారావు. ఈ సంవత్సర కాలంలో తనకెంత మిగిలి ఉంటుందో మనసులోనే లెక్కలేసుకుంటున్నాడు.

బస్సు అన్నిస్టాపుల్లోని జనాన్ని ఎక్కించుకొని ఊరి వెలుపలకు రాగానే వేగం పుంజుకుంది. కండక్టర్ తన సీట్లో కూర్చుని యస్సార్ పూర్తి చేసుకోవడంలో నిమగ్నమయ్యాడు. ఇంతలో చెట్టుచాటు నుంచి వచ్చిన చెక్కింగ్ అధికార్లు చెయ్యి అడ్డంపెట్టి బస్సునాపి బస్సులో ప్రవేశించారు. ఒకతను కండక్టర్ దగ్గర యస్సార్‌ను చేతికి తీసుకున్నాడు. మరొకతను ప్రయాణీకుల టిక్కెట్లను చెక్ చెయ్యడం మొదలెట్టాడు. అందరి టిక్కెట్లూ సరిపోయాయి. రామారావు దగ్గరకి వచ్చాడు అధికారి. రామారావు జేబులోంచి టిక్కెట్టు తీసి ఇచ్చాడు. అధికారి టిక్కెట్టు చూసి చేతికిస్తూ,

"క్యాట్‌కార్డు ఒకసారి చూపించండి" అన్నాడు.

క్యాట్‌కార్డును అధికారికి ఇచ్చాడు రామారావు. అధికారి దాన్ని పరిశీలించి "నిన్నటితో దీని టైం ముగిసింది. ఈ రోజుకు చెల్లదు. క్యాట్ కార్డు టిక్కెట్టు ఎలా కొట్టించారు మీరు?" గద్దించాడు అధికారి.

"సార్ ఇంకా టైం ఉందనుకున్నాను సార్.." నేను చూసుకోలేదు సార్" సంజాయిషీ ఇచ్చుకున్నాడు రామారావు.

"నో వీల్లేదు ఇది మోసం కిందికి వస్తుంది. 500 రూపాయలు జరిమానా చెల్లించండి" అన్నాడు అధికారి.

రామారావు ఎంతో సేపు ప్రాధేయపడ్డాడు. కానీ లాభం లేకపోయింది. చివరికి మళ్ళీ 500 రూపాయలు కట్టక తప్పలేదు రామారావుకి.

చెకింగ్ అధికార్లు కండక్టర్ అజాగ్రత్తను గూర్చి రుసరుసలాడి యస్సార్‌లో ఏదో కంప్లెయింట్ రాసి దిగి వెళ్ళిపోయారు.

ఇక జన్మలో క్యాట్‌కార్డు తీసుకోకూడదనుకుంటూ బస్సు దిగి వెళ్ళిపోయాడు పాపం రామారావు.

❋

# మీ సమస్యలకు పరిష్కారాలు

## ప్రియదత్త పాఠకులకు ప్రత్యేకం

**మనలో చాలామంది వివిధరకాల సమస్యలతో సతమతమవుతూ ఉంటారు. అలాంటి వారందరికీ ఉచిత రీతిని సహకరించాలన్న భావంతో, తమపేరు చెప్పడానికి అంగీకరించని ఒక ఆధ్యాత్మిక గురుదేవులు, పాఠకుల సమస్యలకు సమాధానాలివ్వడానికి అంగీకరించారని తెలపడానికి ఆనందిస్తున్నాము.**

**పాఠకులు ఈ క్రింది ప్రశ్న కూపన్ పూర్తిచేసి వారంలోగా మాకు పంపితే, వారి నుండి మీకు సమస్యలకు పరిష్కారమార్గాలు అందజేయడం జరుగుతుంది.**

**ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు అంగీకరించబడవని గమనించాలి. ప్రశ్నలు మాకు చేరిన వెంటనే వరసక్రమంలో సమాధానాలు అందించడం జరుగుతుంది.**

**- ఎడిటర్**

### గురుదేవో మహేశ్వరః

## సమస్య - సమాధానం

పేరు:..............................................................

పుట్టిన తేదీ :.................. సమయం:.................. నక్షత్రం:..........................

మీ ప్రశ్న :..............................................................

..............................................................

*(స్థలం చాలనిచో వేరే తెల్లకాగితంపై రాసి ఈ కూపనుతోబాటు జతపర్చండి)*

చిరునామా :..............................................................

..............................................................

..............................................................

..............................................................పిన్ కోడ్ :..........................

**గమనిక :**

* కూపన్ జతపర్చని ప్రశ్నలు అంగీకరించబడవు.
* ఒకరు ఒక సమస్య గురించి మాత్రమే ప్రశ్న రాసి పంపాలి.
* సమాధానాలు మాకు చేరిన ప్రశ్నల వరుసక్రమంలో, ప్రియదత్తలో ప్రచురించడం జరుగుతుంది. మీ పేరు, చిరునామా రహస్యంగా ఉంచాలని భావిస్తే ముందుగా ఆ విషయం తెలపాలి.

**- ఎడిటర్**